సాక్షి నిర్మల్
మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023



'చితి'కి పోతున్న 'కౌలు'
ఉమ్మడి జిల్లాలో వివిధ కారణలతో ఆత్మహత్యలు చేసుకున్న రైతుల్లో కౌలురైతులే ఎక్కువ. గత మూడేళ్లలో 135 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోగా అందులో 65 మంది కౌలు రైతులే. 8లో▸



దేశీదారుకు అడ్డుకట్టపడేనా?
తెలంగాణలో మద్యం ధరలు అధికంగా ఉండటంతో సరిహద్దున ఉన్న మహారాష్ట్ర నుంచి దేశీదారు విచ్చలవిడిగా జిల్లాకు రవాణా అవుతోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. 9లో▸

గరిష్టం/కనిష్టం
28.4 /23.6

వాతావరణం
ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. తుపాను ప్రభావంతో జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో మోస్తరా వాన కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అర్జీలు త్వరగా పరిష్కరించాలి
- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: వివిధ సమస్యలపై ప్రజావాణికి వచ్చే అర్జీలను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ మండలాల నుండి వచ్చిన పలువురు తమ గోడును కలెక్టర్‌కు వెల్లబోసుకున్నారు. కొన్ని సమస్యలను కలెక్టర్ అక్కడికక్కడే పరిష్కరించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఆసరా పెన్షన్స్, భూ సమస్యలు, ధరణి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై తక్షణమే స్పందించి అర్జీదారుని సమస్యలు పరిష్కరించాలని కోరారు. తహసీల్దార్ వారివారి పరిధిలో ఉన్న మండలాల్లో జరిగే అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

సామాన్యులకు అండగా పోలీసులు



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: సామాన్యులకు పోలీసులు అండగా ఉండాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ జిల్లా పోలీసులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ వారి సమస్యలు తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పోలీసుల సహాయం కావాలనుకునేవారు ఠాణాలో ఫిర్యాదు చేయాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వీలుకాని పక్షంలో 8712659599 నంబర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వాలని సూచించారు.

56 మంది పీజీహెచ్‌ఎంలకు పదోన్నతి

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ జిల్లాలో సజావుగా సాగుతోంది. జిల్లాలో 56 మంది స్కూల్ అసిస్టెంట్లకు పీజీహెచ్‌ఎంలుగా పదోన్నతి లభించింది. వీరంతా సోమవారం తమకు కేటాయించిన పాఠశాలల్లో జాయిన్ అయ్యారు. మల్టీజోన్ పోస్టు కావడంతో కొందరు జిల్లా నుంచి ఇతర జిల్లాలకు ప్రమోషన్‌పై వెళ్లగా, ఇతర జిల్లా నుంచి నిర్మల్ జిల్లాకు కూడా కొందరు వచ్చారు. గవర్నమెంట్ కేటగిరీలో ఆరుగురికి ప్రమోషన్ లభించగా, ఒకరు నిజామాబాద్ జిల్లాకు వెళ్లారు. ఆ జిల్లా నుంచి మరొకరు నిర్మల్ జిల్లాకు వచ్చారు. లోకల్ బాడీ కేటగిరీలో జిల్లాలో 43 మందికి ప్రమోషన్లు లభించగా 9 మంది ఇతర జిల్లాలకు వెళ్లారు. ఇతర జిల్లాల నుంచి ఆరుగురు నిర్మల్‌కు వచ్చారు. మంగళవారం నుంచి స్కూల్ అసిస్టెంట్ల బదిలీ చేపడతారు.

మెగా డీఎస్సీ ప్రకటించాలి




డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

నిర్మల్ రూరల్: డీఎస్సీలో పోస్టుల సంఖ్య మరింత పెంచాలని కోరుతూ డీఈవో రవీందర్‌రెడ్డికి డీఈడీ, బీఈడీ అభ్యర్థుల సంఘం ప్రతినిధులు సోమవారం వినతిపత్రం అందించారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన 13,086 పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ప్రస్తుతం ఇచ్చిన 5 వేల పోస్టులను రద్దుచేసి, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులు, ఆర్ట్ పోస్టులను కలిపి 20 వేల పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలని కోరారు. ప్రస్తుతం డీఎస్సీలో ప్రకటించిన సిలబస్ కాకుండా 2017లో టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన సిలబస్‌ని కొనసాగించాలన్నారు. ప్రిపరేషన్ కోసం ఐదు నెలల సమయం కేటాయించాలన్నారు. అప్లికేషన్ ఫీజు రూ.200లకు తగ్గించాలని కోరారు.

నిఘా నీడలో భైంసా..!





- నేడు భైంసాలో గణేశ్ నిమజ్జనం
- విస్తృతంగా ఏర్పాట్లు
- ప్రశాంతంగా జరిగేలా పోలీసుల చర్యలు
- 600 మంది పోలీసు బందోబస్తు
- అడుగడుగునా నిఘానేత్రం
- కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షణ

భైంసా/భైంసాటౌన్: గణపతి నవరాత్రి ఉత్సవాలు తుది దశకు చేరాయి. మరో రెండు రోజుల్లో గౌరీ తనయుడు గంగమ్మ చెంతకు చేరనున్నాడు. దీంతో జిల్లా వ్యాప్తంగా నిమజ్జనోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. గణేశ్ నిమజ్జనోత్సవాలు అనగానే రాజధాని హైదరాబాద్ తర్వాత అందరి దృష్టి భైంసాపైనే ఉంటుంది. సున్నితమైన ప్రాంతం కావడంతో భైంసాలో నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇప్పటికే భైంసా పట్టణం పూర్తిగా నిఘా నీడలోకి వెళ్లిపోయింది. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. భైంసాలో గతంలో చోటు చేసుకున్న ఘటనల నేపథ్యంలో ఇక్కడ గణేశ్ ఉత్సవాలపై అధికారులు ఏటా అప్రమత్తంగా ఉంటున్నారు. భైంసాలో మంగళవారం గణేశ్ నిమజ్జనం జరుగనుంది. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం భట్టిగల్లి మున్నూరుకాపు సంఘంలో హారతితో శోభాయాత్ర ప్రారంభమవుతుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. శోభాయాత్ర మార్గంతోపాటు సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పట్టణ పోలీస్‌స్టేషన్లోని కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానించారు. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో నిమజ్జనోత్సవాలకు ఏర్పాట్లు చేశారు.



గడ్డెన్నవాగు వద్ద నిమజ్జన ఏర్పాట్లు



కమాండ్ కంట్రోల్‌రూం తెరపై పట్టణ ప్రధాన కూడళ్లు

శోభాయాత్ర ఇలా...
ముందుగా భట్టిగల్లి మున్నూరుకాపు సంఘంలోని గణేశ్ మండలి వద్ద హిందూ ఉత్సవ సమితి సభ్యులతోపాటు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, అధికారుల హారతి కార్యక్రమంతో శోభాయాత్ర ప్రారంభమవుతుంది. ఆయా కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు శోభాయాత్ర మార్గం మీదుగా పంజేషా చౌక్‌కు చేరుకుంటాయి. అక్కడి నుంచి కిసాన్‌గల్లీ, పురాణబజార్ చేరుకుంటాయి. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత వేదిక నుంచి గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన ఘాట్‌కు చేరుకుంటాయి. అక్కడ రెండు క్రేన్ల సహాయంతో విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు.

భారీ బందోబస్తు..
వినాయక నిమజ్జనోత్సవాల సందర్భంగా భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదివరకు ఇక్కడ పనిచేసి వెళ్లిన ఎస్సైలు, సీఐలను రప్పించారు. దాదాపు 600 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. వజ్ర వాహనాలతోపాటు డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పికెట్, మున్సిపల్ ఆధ్వర్యంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. శోభాయాత్ర దారిలో ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల దృశ్యాలను కమాండ్ కంట్రోల్ రూం ద్వారా వీక్షించనున్నారు.

బందోబస్తు ఇలా...

సీసీ కెమెరాలు	200
ప్రైవేటు కెమెరాలు	50
అదనపు ఎస్పీలు	03
డీఎస్పీలు	04
సీఐలు	15
ఎస్సైలు	45
బలగాలు	575

సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిఘా
- ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్



మాట్లాడుతున్న ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్

భైంసాటౌన్: భైంసా పట్టణంలో మంగళవారం జరుగనున్న వినాయక నిమజ్జనోత్సవాలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ సూచించారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. నిమజ్జనోత్సవం సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరుగకుండా 600 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముగ్గురు అదనపు ఎస్పీలు, నలుగురు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 45 మంది ఎస్సైలతోపాటు 575 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటారని వివరించారు. 200 సీసీ కెమెరాలు, 50 ప్రైవేట్ కెమెరాలు, డ్రోన్, వీడియో కెమెరాలతో నిఘా ఉంటుందన్నారు. నిమజ్జనోత్సవం త్వరగా ప్రారంభించి, త్వరగా ముగిసేలా ఉత్సవ సమితి సభ్యులు, గణేశ్ మండలి నిర్వాహకులు సహకరించాలని కోరారు. ఏదైనా సమస్య తలెత్తితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

'సంప్రదాయబద్ధంగా జరుపుకుందాం'

భైంసాటౌన్: పట్టణంలో వినాయక నిమజ్జనోత్సవం సంప్రదాయబద్ధంగా జరుపుకుందామని హిందూ ఉత్సవసమితి సభ్యులు అన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు భట్టిగల్లీలోని మున్నూరుకాపు భవనంలో పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులతో హారతి కార్యక్రమం అనంతరం నిమజ్జన శోభాయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. శోభాయాత్ర సమయంలో ఏవైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే తమను సంప్రదించాలని, నిమజ్జనం ముగిసేవరకు తాము అందుబాటులో ఉంటామని వివరించారు. మండలి నిర్వాహకులు, యువకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధ్యక్షుడు విలాస్ గాదేవార్, కార్యదర్శి ముప్కం రామకృష్ణగౌడ్, సభ్యులు నాగేశ్, తూం దత్తాత్రి, పాపన్న, కోర్వ చిన్నన్న, భోజన్న, గోపాల్ సూత్రావే ఉన్నారు.



మాట్లాడుతున్న విలాస్ గాదేవార్

మద్యం షాపులు మూసివేత

నిర్మల్‌టౌన్: గణేశ్ నిమజ్జనోత్సవాల సందర్భంగా జిల్లాలో మద్యం షాపులు మూసివేయించాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ జిల్లా ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో అనేక చోట్ల మత హింస జరిగిన నేపథ్యంలో మద్యం షాపులు మూసివేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. భైంసాలో ఈనెల 25 సాయంత్రం 6 నుంచి 27 సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూసి ఉంటాయని తెలిపారు. నిర్మల్, ఖానాపూర్‌లో ఈ నెల 27 సాయంత్రం 6 నుంచి 29న సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూసి ఉంటాయని వెల్లడించారు.

స్వచ్ఛ పల్లెలే 'స్వచ్ఛత హీ సేవా' లక్ష్యం

- అక్టోబర్ 2 వరకు నిర్వహణ
- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



స్వచ్ఛత హీ సేవా ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: పల్లెలు స్వచ్ఛంగా ఉండాలన్న లక్ష్యంతోనే స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం చేపడుతున్నట్లు కలెక్టర్ వరుణ్‌రెడ్డి తెలిపారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం స్వచ్ఛత హీ సేవా ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డీఆర్డీవో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం అక్టోబర్ 2 వరకు కొనసాగుతుందన్నారు. ఈ నెల 24న చారిత్రాత్మక, గుర్తింపు పొందిన, ముఖ్యమైన ప్రదేశాల్లో పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి శ్రమదానం, 25న ప్లాస్టిక్ వ్యర్థా నిర్వహణ దినోత్సవంలో భాగంగా ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా స్టీల్ బ్యాంకు ఇతర ప్రత్యామ్నాయ వస్తువులను తయారు చేసి ప్రదర్శించడం జరిగిందని వివరించారు. 26న యువతీ యువకుల ద్వారా పెద్ద ఎత్తున శ్రమదానం, స్వచ్ఛత రన్, క్రీడల నిర్వహణ, కంపోస్టు షెడ్లు విజిట్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ కార్యకర్తల ద్వారా కార్యక్రమాలు, సెమినార్ల నిర్వహణ, ట్రాక్టర్లను స్వచ్ఛత రథంగా తయారీ, ఓడీఎఫ్ ప్లస్ గోడ చిత్రాలు వేయించే కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 27న అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం, శ్రమదానం ద్వారా చెరువులు కుంటల వద్ద వ్యర్థాల తొలగింపు, 28న మహిళల శ్రమదాన కార్యక్రమాలు, మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున మహిళల ద్వారా అవగాహన కార్యక్రమాల నిర్వహణ, 29న కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా అధికారుల ద్వారా సర్పంచ్ సంవాద్ కార్యక్రమాల నిర్వహణ, మురుగునీటి నిర్వహణపైన ప్రత్యేక కార్యక్రమాలు, 30న డంపింగ్ షెడ్, ట్రాక్టర్, ఇంకుడు గుంతలకు రిపేర్, కలర్స్ వేయడం, అక్టోబర్ 1న భారీ ఎత్తున ప్రజలను సమీకరించి విస్తృతమైన శ్రమదాన కార్యక్రమాలు, 2న ప్రత్యేక గ్రామసభల ఏర్పాటు, సన్మాన కార్యక్రమాలు, పాఠశాలల స్థాయిలో బహుమతుల ప్రదాన కార్యక్రమాలు నిర్వహించాలని వివరించారు. మండల పరిషత్ అధికారులు, పంచాయతీ అధికారులు పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల నివేదిక ఇవ్వండి

- చీఫ్ ఎలక్టోరల్ అధికారి వికాస్‌రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని ప్రతీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి అక్కడ అవసరమైన మౌలిక వసతులు ఉన్నాయా, లేవా పరిశీలించి నివేదిక ఇవ్వాలని చీఫ్ ఎలక్టోరల్ అధికారి వికాస్‌రాజ్ సూచించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధతపై హైదరాబాద్ నుంచి రాష్ట్రస్థాయి అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ, రెండో ఓటరు జాబితా సవరణ, పెండింగ్ దరఖాస్తులు, జిల్లా ఎన్నికల ప్రణాళిక రూపకల్పన, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ తదితర అంశాలపై సూచనలు చేశారు. ఎన్నికల నిమిత్తం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలను రిటర్నింగ్ అధికారులు ఒకసారి పరిశీలించి ధ్రువీకరించుకోవాలని సూచించారు. తుది ప్రతిపాదనలు క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం సమర్పించాలన్నారు. యువత, దివ్యాంగులు మహిళల కోసం ప్రత్యేక మోడల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ నిర్మల్ జిల్లా వ్యాప్తంగా జూలై 16 నుంచి సెప్టెంబర్ 25 వరకు ఫారం 6 30,553, ఫారం 7 9,283, ఫారం 8 15,420 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఓటర్ దరఖాస్తులకు ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలను పాటించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ బాటలో నడవాలి



దీన్ దయాళ్ జయంతి వేడుకల్లో నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయుని బాటలో నడవాలని బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1952లో భారతీయ జన్ సంఘ్ పార్టీలో చేరి ఏకాత్మ మానవవాదం పేరుతో సమాజంలో అట్టడుగున ఉన్న వ్యక్తికే ప్రభుత్వ పథకాల మొదటి ప్రయోజనం చేకూరాలన్న అంత్యోదయ భావనను రూపొందించారన్నారు. ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా అవతరించిన బీజేపీకి పటిష్ఠ పునాదులు వేసిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, నగర్ నారాయణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజు, జిల్లా అధికార ప్రతినిధి నరేందర్ బర్కుంట, కౌన్సిల్ మెంబర్ అయ్యన్నగారి రాజేందర్, మండల అధ్యక్షుడు శైలేష్, నాయుడి మురళీధర్, అనుముల శ్రావణ్‌కుమార్, పంతికె ప్రకాశ్, తోట సత్యనారాయణ, హరీశ్, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సహకారాన్ని గుర్తించండి

- యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ
- ప్రారంభమైన సమ్మె



నిరవధిక సమ్మెలో ఆశ వర్కర్లు

నిర్మల్‌చైన్‌గేట్: కరోనా మహమ్మారి కాలంలో వైరస్ నియంత్రణలో ఆశ వర్కర్లు పోషించిన కీలక పాత్రను, ప్రజలకు అందించిన సేవలను గుర్తించాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్.చంద్రకళ కోరారు. ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశ వర్కర్లకు ఇస్తున్న పారితోషికం రూ.18 వేలకు పెంచాలని, ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా సౌకర్యం రూ.5 లక్షలు, హెల్త్ కార్డులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టుల్లో ఆశ వర్కర్లకు పదోన్నతి కల్పించి వెయిటేజీ మార్కులు నిర్ణయం చేయాలన్నారు. పారితోషికం లేని అదనపు పనులు తమతో చేయించొద్దని సూచించారు. టీబీ స్పుటమ్ డబ్బాలను మోపించే పని రద్దు చేయాలన్నారు. టీబీ, లెప్రసీ, కంటి వెలుగు తదితర పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లెప్రసీ సర్వేలో వస్తున్న ఇబ్బందులను పరిష్కరించి వలంటీర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఆశ వర్కర్ల జాబ్ చార్టర్ విడుదల చేయాలని కోరారు. 2021, జూలై నుంచి డిసెంబర్ వరకు రావాల్సిన 6 నెలల పీఆర్సీ ఏరియర్స్ చెల్లించాలన్నారు. కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు రూ.వెయ్యి చొప్పున 16 నెలల బకాయి డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. 32 రకాల రిజిస్టర్లను ప్రభుత్వమే ప్రింట్ చేసి సరఫరా చేయాలని కోరారు. ప్రసూతి సెలవుల సర్క్యులర్ వెంటనే జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు పి.గంగమణి, ఆశ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు బి.సుజాత, జిల్లా ఉపాధ్యక్షురాలు భాగ్య, కోశాధికారి రామాలక్ష్మి, సభ్యులు అనురాధ, రాధ, ప్రమీల, ఇంద్రజ, వర్ష, సుధ, లత, సౌమ్య, సుజాత, లక్ష్మి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



అంగన్‌వాడీలకు మద్దతు తెలుపుతున్న శ్రీహరిరావు

లక్ష్మణచాంద: అంగన్‌వాడీల సమస్యలను సీఎం కేసీఆర్ వెంటనే పరిష్కరించాలని డీసీసీ అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావు డిమాండ్ చేశారు. లక్ష్మణచాందలో నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు సోమవారం సంఘీభావం తెలిపారు. 15 రోజులుగా అంగన్‌వాడీలు దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీలను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొట్టె శేఖర్, ఓడ్నాల రాజేశ్వర్, అట్ల రాంరెడ్డి, ఈటల శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, సమ్మెట రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్యారెంటీ హామీలు ఇంటింటికీ తీసుకెళ్లాలి

నిర్మల్‌చైన్‌గేట్: కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ హామీలను నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తీసుకెళ్లాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు సూచించారు. నిర్మల్ రూరల్ మండలం న్యూ పోచంపాడ్ ఉపసర్పంచ్ కర్నే భూమన్న సోమవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నిరంకుశత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో నిర్మల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మంద గంగయ్య, పెద్ద మల్లయ్య, వెల్మల పోశెట్టి, గంగారపు చిన్నయ్య, కాంద చిన్న గంగన్న, కర్రె గంగాధర్, కర్రె రాజశేఖర్, కర్రె సాయి చందర్ పాల్గొన్నారు.

ఆ చేప పిల్లలు మాకొద్దు

నర్సాపూర్(జి): మత్స్యకారులకు ఉపాధి కల్పించడంతోపాటు వారి ఆర్థిక అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఏటా చెరువుల్లో ఉచితంగా చేపపిల్లలు పంపిణీ చేస్తోంది. అయితే కాంట్రాక్టర్లు నాణ్యత లేని, తక్కువ సైజు చేప పిల్లలను పంపిణీ చేస్తున్నారు. మండలంలోని నర్సాపూర్(జి), అర్లి(కే), టెంబుర్ని గ్రామాల చెరువుల్లో చేప పిల్లలను వదిలేందుకు సోమవారం మత్స్యశాఖ అధికారులు వచ్చారు. నిబంధనల మేరకు 35-40 ఎంఎం సైజు చేప పిల్లలను పంపిణీ చేయాల్సి ఉండగా 30 ఎంఎంలోపు చేప పిల్లలు ఉండడంతో మత్స్యకారుల సంఘం నాయకులు, మత్స్యకారులు వాటిని తిరస్కరించారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి నాణ్యమైన చేప పిల్లలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లికొండ ముత్యం కోరారు. కార్యక్రమంలో నాయకులు కాలగడ్డ సుధాకర్, పోతరాజు నవీన్, బట్టు ముఖేష్, డాక్టర్ సాయన్న, టెంబుర్ని సాయన్న, మల్కన్న తదితరులు పాల్గొన్నారు.



చేప పిల్లల సైజును చూస్తున్న మత్స్యకారులు

క్లుప్తంగా

పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న మంత్రి


దర్శించుకున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో సోమవారం బసడిపో బోయవాడ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కు చెల్లించారు. అనంతరం గంగపుత్ర సంఘం సభ్యులు మంత్రిని సన్మానించారు. మున్సిపల్ చైర్మన్, గంగపుత్ర సభ్యులు తదితరులు ఉన్నారు.

నిండుకుండలా 'కడెం'



కడెం: కడెం ప్రాజెక్ట్ సోమవారం నీటితో కళకళలాడుతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 700 అడుగులకు చేరుకుంది. మధ్యాహ్నం 6,885 క్యూసెక్కుల ఇన్ ఫ్లో రావడంతో అధికారులు ఒక వరద గేటును ఎత్తివేసి 4162 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

అదిలాబాద్‌రూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. మండలంలోని బంగారుగూడలో గల మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలికల క్రీడా పోటీలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. మూడు రోజుల పాటు క్రీడాపోటీలు కొనసాగనున్నాయన్నారు. గెలుపొందిన విద్యార్థులకు సెప్టెంబర్ 27న బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రాథోడ్ రమేశ్, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, అధికారులు, విద్యార్థులు ఉన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌కు అంతర్జాతీయ గుర్తింపు


పోటీలు ప్రారంభిస్తున్న పార్థసారథి

ఆదిలాబాద్: మార్షల్ ఆర్ట్స్‌కు అంతర్జాతీయ స్థాయిలో ఎంతో గుర్తింపు ఉందని జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సోమవారం నిర్వహించిన ఎస్జీఎఫ్ అండర్-14, 17 బాల, బాలికల జోనల్‌స్థాయి జూడో ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ వల్ల శారీరక దృఢత్వం లభిస్తోందన్నారు. జూడోకు గొప్ప భవిష్యత్తు ఉందని, పట్టుదల, క్రమశిక్షణతో అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు, పెటా సెక్రెటరీ స్వామి, జూడో కోచ్ రాజు, మహేశ్ తదితరులు ఉన్నారు.

'చితి'కి పోతున్న 'కౌలు'



ఈ చిత్రంలో ఇద్దరు పిల్లలతో కలిసి భర్త ఫొటో చూపుతున్న ఈమె పేరు జాదవ్ అనిత. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం పట్‌పట్ తండాకు చెందిన కౌలు రైతు జాదవ్ తుకారాం భార్య. తుకారాం గతేడాది ఐదెకరాలు కౌలుకు తీసుకుని పత్తి, సోయా సాగు చేశాడు. పంట చేతికొచ్చే సమయంలో కురిసిన అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయాడు. పెట్టుబడి కోసం చేసిన అప్పు తీర్చలేక పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో భార్య, ఇద్దరు చిన్నారులు రోడ్డున పడ్డారు. ఇదొక్కటే కాదు.. జిల్లాలో ఇలాంటి బాధిత కుటుంబాలు అనేకం ఉన్నాయి.



- సాగు పెట్టుబడికి ప్రైవేట్ అప్పులే దిక్కు
- ఏటా రైతును వెంటాడుతున్న ప్రకృతి వైపరీత్యాలు
- దిగుబడి రాక.. అప్పు తీర్చలేక..
- మ'రుణ' శాసనం లిఖిస్తున్నారు..

ఇచ్చోడ(బోథ్): సాగు కలిసిరాక కౌలు రైతు బలిపీఠం ఎక్కుతున్నాడు. పంట రుణాలతో పాటు సంక్షేమ పథకాలు అందకపోవడం.. మరోవైపు వెంటాడుతున్న ప్రకృతి వైపరీత్యాలతో సాగుకు చేసిన అప్పు తీర్చే దారి లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. బాధిత కుటుంబాలకు పుట్టెడు దుఃఖం మిగుల్చుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వివిధ కారణాలతో తనువు చాలించిన అన్నదాతల్లో కౌలు రైతులే అధికం. రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1,17,268 మంది కౌలు రైతులు ఉన్నారు. ఇందులో గడిచిన మూడేళ్లలో 65 మంది బలవన్మరణాలకు పాల్పడడం గమనార్హం.

ప్రైవేట్ అప్పులే దిక్కు

కౌలు రైతులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం, బ్యాంకులు సైతం రుణాలు ఇవ్వక పోవడంతో గత్యంతరం లేక ప్రైవేట్ అప్పులను ఆశ్రయించాల్సిన పరిస్థితి. మరోవైపు నకిలీ విత్తనాలు మొలకెత్తకపోవడం, వాతావరణ పరిస్థితులు అనుకూలించక పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో పెట్టుబడి పెరిగి, దిగుబడి కూడా ఆశించిన స్థాయిలో అందక కౌలు సైతం చెల్లించలేని పరిస్థితి తలెత్తుతోంది. అప్పు తీర్చే దారి లేక తీవ్ర ఒత్తిడికి గురై బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

అతివృష్టి, అనావృష్టితో...

భూమి కౌలుకు తీసుకున్నప్పటి నుంచి సాగుకు పెట్టుబడి పెట్టాల్సిందే. రెండు, మూడేళ్ల క్రితం ఎకరాకు రూ.5వేలు ఉన్న కౌలు ప్రస్తుతం రూ.10 వేలు దాటింది. పెరిగిన పెట్టుబడితో పాటు అతివృష్టి, అనావృష్టి కారణంగా పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రావడం లేదు. ఈక్రమంలో మరోసారి అప్పు చేసి కౌలు చెల్లించాల్సిన దుస్థితి. ఇలా అప్పుల ఊబిలో చిక్కుకున్న కౌలురైతు చివరకు తనువు చాలిస్తున్నాడు. బాధిత కుటుంబానికి తీరని శోకం మిగుల్చుతున్నాడు.

ఉమ్మడి జిల్లాలో కౌలు రైతుల వివరాలు

జిల్లా	కౌలురైతులు
ఆదిలాబాద్	28,763
నిర్మల్	33,212
కుమురంభీం	26,754
మంచిర్యాల	28,584

ప్రభుత్వ పథకాలు అమలు చేయాలి




సాగుకు చేసిన అప్పు తీర్చే దారి లేక కౌలు రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. రైతు ఆత్మహత్యలను అరికట్టాలంటే ప్రభుత్వం వీరికి వెంటనే సంక్షేమ పథకాలు అమలు చేయాలి. అలాగే బాధిత కుటుంబాలను సైతం ఆదుకోవాలి.

– సంగెం బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు

కౌలు రైతుల మరణాల వివరాలు...

జిల్లా	2020	2021	2022	2023	మొత్తం
ఆదిలాబాద్	09	13	10	02	34
నిర్మల్	02	04	08	03	17
మంచిర్యాల	03	02	02	01	08
కుమురంభీం	02	01	02	01	07
మొత్తం	16	20	22	07	65



ఐకమత్యంతోనే పార్టీ పటిష్టత

- కర్ణాటక ఎమ్మెల్సీ కేశవ్‌ప్రసాద్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేశవ్‌ప్రసాద్

ఆదిలాబాద్: కార్యకర్తలందరూ ఐక్యమత్యంతో కృషి చేస్తేనే పార్టీ పటిష్టత సాధ్యమవుతుందని కర్ణాటక ఎమ్మెల్సీ కేశవ్‌ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పార్లమెంట్ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా బీజేపీ పదాధికారులు, జిల్లాల అధ్యక్షులతో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చే ఎన్నికలు పార్టీకి ఎంతో కీలకమైనవని వెల్లడించారు. పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అదేవిధంగా కేంద్ర పథకాలను వివరించాలన్నారు. అంతకుముందు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆయన్ను సన్మానించారు. పార్లమెంట్ ఇన్‌చార్జి అయ్యన్నగారి భూమయ్య, కోకన్వీనర్ మయూర్ చంద్ర, జిల్లా ఇన్‌చార్జి అల్జాపూర్ శ్రీనివాస్, బద్దం లింగారెడ్డి, చిట్యాల సుహాసినిరెడ్డి, రమాదేవి, లోక ప్రవీణ్‌రెడ్డి, బోయర్ విజయ్, దయాకర్ పాల్గొన్నారు.

ఇద్దరు మట్కా నిందితుల అరెస్ట్


పట్టుకున్న నిందితులు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని సాత్నాల బస్టాండ్ ప్రాంతంలో మట్కా నిర్వహిస్తున్న సయ్యద్ అక్బర్ లియాస్ సజ్జు, ఠాకూర్ రాజేందర్ సింగ్‌ను అరెస్టు చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ డి.సాయినాథ్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5,430 నగదుతోపాటు మట్కా చీటీలు, రెండు సెల్‌ఫోన్లు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకుని వన్‌టౌన్‌లో అప్పగించామన్నారు. ఈ దాడుల్లో సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడిన పోలీసు


వృద్ధురాలిని తీసుకువస్తూ..

భైంసా: బాసరలోని గోదావరినది వద్ద ఆత్మహత్యకు యత్నించిన మహిళను పోలీస్ కానిస్టేబుల్ వినాయక్ కాపాడారు. వివరాల్లోకి వెళ్తే..నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన దేవుబాయికి కళ్లు సరిగా కనిపించవు. తన ఆరోగ్య సమస్య కుటుంబీకులకు ఇబ్బందిగా మారకూడదని సోమవారం బాసర గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు యత్నించింది. అక్కడే ఉన్న కానిస్టేబుల్ వినాయక్, స్థానికుడు లింగన్నయాదవ్‌లు అప్రమత్తమై మహిళను కాపాడారు. ఈ విషయం కుటుంబీకులకు సమాచారం అందించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళను కాపాడిన కానిస్టేబుల్‌తోపాటు స్థానికుడిని పలువురు అభినందించారు.

గోదావరి నదిలో ఒకరి ఆత్మహత్య

భైంసా: బాసరలోని గోదావరి నది సమీపంలో హారతిఘాట్ పక్కన మహారాష్ట్రకు చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మహారాష్ట్రలోని బోకర్‌కుచెందిన బూరేవార్ తిరుపతి (49) ఈనెల 22న ఇంటి నుంచి కనిపించకుండా పోయాడు. సోమవారం గోదావరి నదిలో ప్రవహిస్తున్న నీటిలో శవమై కనిపించాడు. మృతుడి కుమారుడు శివ బాసర వచ్చి మృతదేహాన్ని గుర్తించాడు. తన తండ్రి గతేడాదిగా బ్లడ్ క్యాన్సర్‌తో ఇబ్బంది పడుతున్నాడని ఫోర్త్‌స్టేజీలో ఉండడంతో ఇంటి నుంచి వెళ్లిపోయి ఇలా ఆత్మహత్య చేసుకున్నాడని రోదించాడు. ఆయన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న బాసర పోలీసులు మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని మహిళ

భైంసా: బాసర రైల్వేస్టేషన్ వద్ద గుర్తుతెలియని మహిళ కనిపించింది. సోమవారం స్టేషన్ సమీపంలో ఉన్న ఈమెను గమనించిన స్థానికులు వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఎలాంటి సమాధానం రాలేదు. ఆరోగ్య సమస్యలు ఉండడంతో ఆమెను 108 అంబులెన్సులో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతుంది.


వ్యక్తి అదృశ్యం

మామడ: సోన్‌పేట్ గ్రామానికి చెందిన యుగేందర్ (37) అదృశమయ్యారు. ఈనెల 15 నుంచి కనిపించడం లేదని భార్య చిన్నమ్మ ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. అదే గ్రామానికి చెందిన వ్యక్తికి మంత్రాలు వస్తాయని యుగేందర్ అనడంతో కులంలో జరి మానా విధిస్తారని భయంతో వెళ్లినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడికి ఐదేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: మహిళపై దాడి చేసి నగదు, సెల్‌ఫోన్ లాక్కున్న యువకుడికి ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ నిర్మల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.అజేశ్‌కుమార్ సోమవారం తీర్పునిచ్చారు. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపిన వివరాలు.. జిల్లా కేంద్రానికి చెందిన బాధితురాలు బుధవార్‌పేట్‌కు చెందిన ఆదుముల్ల వినయ్ స్నేహితులుగా కలిసిమెలిసి ఉండేవారు. ఈ క్రమంలో 2022 జనవరి 18న రాత్రి బాధితురాలిని గాంధీచౌక్‌కు రమ్మన్నాడు. మాట్లాడుకుందామని చెప్పి మస్తాన్‌దుబ్బ ప్రాంతానికి తీసుకెళ్లాడు. తనను ప్రేమించాలని బలవంతం చేయగా ఒప్పుకోకపోవడంతో ఆమెపై దాడి చేసి రూ.2 వేలు, సెల్‌ఫోన్ లాక్కొన్నాడు. ఈ విషయంపై బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై అరఫత్ కేసు నమోదు చేశారు. నేరస్తుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా ఏపీపీ రమణారావు 11 మంది సాక్షులను ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో ఈ మేరకు జడ్జి తీర్పు వెలువరించారు.

దివ్యాంగులైనా తోడుగా..



ముధోల్: మండల కేంద్రంలోని నయాబాదికి చెందిన వాసిమోద్దీన్, కోలీగల్లీకి చెందిన సంజీవ్‌లు ఇద్దరు దివ్యాంగులే. ఒకరికొకరు సాయం చేసుకుంటూ ముందుకెళ్తున్నారు. ఒక చేయి, ఒక కాలు పని చేయకపోయిన వాసిమోద్దీన్ స్కూటర్‌పై ఏదో ఒక వ్యాపారం చేస్తుంటాడు. సంజీవ్‌కు కాలు లేకపోయిన నయాబాదీ వద్ద చిన్న కిరాణషాపు పెట్టుకుని జీవిస్తున్నాడు. సోమవారం సంజీవ్ తన మూడు చక్రాల సైకిల్ ముందు టైర్ పంక్చర్ అయింది. అటువైపు వెళ్తున్న వాసీమోద్దీన్ గమనించి తన వద్ద ఉన్న చిన్నతాడును సంజీవ్‌కు అందించాడు. ఆ తాడును సైకిల్‌కు కట్టి పంక్చర్ షాప్ వద్దకు తీసుకెళ్లాడు. దివ్యాంగులైన ఇద్దరు సాయం చేసుకోవడం పట్ల వారి స్నేహానికి కాలనీవాసులు మంత్రముగ్ధులయ్యారు.

ట్రిపుల్‌ఐటీకి అండగా ఉంటాం


పుష్పగుచ్ఛం అందిస్తున్న వీసీ ప్రొఫెసర్

భైంసా: బాసర ట్రిపుల్ ఐటీకి ప్రభుత్వపరంగా అన్నివిధాల అండగా ఉంటామని మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో ట్రిపుల్‌ఐటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి.. ట్రిపుల్‌ఐటీలో తీసుకుంటున్న నిర్ణయాలు అమలు పరుస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. విదేశాల్లోనూ విద్యార్థులు పలు కంపెనీల్లో ఎంపికకావడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. తెలంగాణలోనే అగ్రగామి విశ్వవిద్యాలయంగా మార్చేందుకు ట్రిపుల్‌ఐటీ సిబ్బంది తీసుకుంటున్న చర్యలను మంత్రి అభినందించారు. నిజామాబాద్‌లో ప్రారంభించిన ఐటీ టవర్స్‌లో బాసర ట్రిపుల్‌ఐటీకి ప్రత్యేక స్థలం కేటాయించినందుకు మంత్రికి వీసీ కృతజ్ఞతలు తెలిపారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్


అర్జీలు స్వీకరిస్తున్న చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల అర్జీలను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ అర్జీలను శాఖల అధికారులను పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కనక భీంరావు, ఏడీఎంహెచ్‌ఓ కుడ్మ బాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, ఆర్‌సీఓ గంగాధర్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ మేనేజర్ లింగు తదితరులు పాల్గొన్నారు.

- తనకు అటవీ హక్కు పత్రం మంజూరు చేయాలని బజార్‌హత్నూర్ మండలం మోహది గ్రామానికి చెందిన విజయ అర్జీ అందించింది.
- పాడి పరిశ్రమకు రుణం మంజూరు చేయాలని ఇంద్రవెల్లి మండలం జాలంతండా గ్రామానికి చెందిన కుంరం చిన్నుబాయి విన్నవించాడు.
- సిర్పూర్(యూ) మండలం సిర్పూర్ గ్రామస్తులు తమకు స్వయం ఉపాధికి రుణాలు ఇప్పించాలని అర్జీలు అందజేశారు.
- తన వైద్య చికిత్సకు ఆర్థికసాయం అందించాలని ఉట్నూర్ మండలం హీరాపూర్ గ్రామానికి చెందిన చిక్రం గిరిజాబాయి విన్నవించింది.

అసైన్డ్ భూములకు పహణీ ఇవ్వాలి

- గిరిజనేతరుల ఆందోళన
- రెండు గంటలపాటు రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న గిరిజనేతరులు

ఇంద్రవెల్లి: ఏజెన్సీ ప్రాంతంలో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములకు పహణీ ఇవ్వాలని గిరిజనేతరులు డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రధానరహదారిపై సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనేతరుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భారత్ వాగ్మారే మాట్లాడారు. ఆ భూములకు పహాని ఇవ్వడంతోపాటు రుణమాఫీ, బ్యాంక్ రుణాలు పొందే సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వారిని వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తామన్నారు. కాగా, రెండుగంటల పాటు రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇక్కట్లు పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారిని స్టేషన్‌కు తరలించారు. నాయకులను విడిచిపెట్టాలని పోలీసుస్టేషన్ ఎదుట గిరిజనేతరులు ధర్నాకు దిగగా, వారిని చెదరగొట్టారు. ఈ ధర్నాలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు రాథోడ్ రమేశ్, రేఖానాయక్, రాథోడ్ సుమన్‌బాయి, గోవింద్‌నాయక్‌లు గిరిజనేతరుల సమస్యలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేస్తోందన్నారు. ధర్నా చేపట్టిన నాయకులపై కేసులు నమోదు చేయాలని డీఎస్పీ నాగేందర్, సీఐ రామకృష్ణ స్థానిక ఎస్సై సునీల్‌ను ఆదేశించారు. గిరిజనేతరుల సంఘం మండల అధ్యక్షుడు లాహానే సంజీవ్, వైస్ ఎంపీపీ పద్వాల్ గోపాల్‌సింగ్, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, అన్నాభావు సాఠే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగ్ మోరే, నాయకులు ఉత్తం కాంబ్లే, మసుద్ మహ్మద్, రాజువర్ధన్, సత్యానంద్ పాల్గొన్నారు.

సమాచార కమిషన్‌ను త్వరగా ఏర్పాటు చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర సమాచార కమిషన్‌ను ప్రభుత్వం త్వరగా ఏర్పాటు చేయాలని ఆర్టీఐ ఆక్టివిస్టు సమాచార హక్కు రక్షణ చట్టం 2005 రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమలాకర్ కోరారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మండల అధ్యక్షుడు వినోద్ కుమార్‌తో కలిసి మాట్లాడారు. ఫిబ్రవరిలో సమాచార కమిషన్ పదవి కాలం ముగిసినా కొత్తగా ఏర్పాటు చేయలేదన్నారు. సమాచారం కోసం వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ఖానాపూర్: నిర్మల్‌లో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ విశ్వేశ్వర్ తెలిపారు. ఏ.ఆదిత్య డిస్కస్ త్రో విభాగంలో ప్రథమ స్థానం, అతాంగ్ లాంగ్‌జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. కరీంనగర్‌లో త్వరలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వీరు పాల్గొంటారని వివరించారు.

మారని బతుకులు


సమ్మెలో పాల్గొంటున్న మండల కారోబారీలు (ఫైల్)

- దయనీయస్థితిలో పంచాయతీ కారోబారీలు
- రిటైర్మెంట్‌కు దగ్గర పడుతున్నా.. అందని కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత
- ప్రభుత్వ స్పందన కోసం ఎదురుచూపు

గుడిహత్నూర్: గ్రామ పంచాయతీ పాలనలో కీలక పాత్ర పోషిస్తున్న పంచాయతీ కారోబారీలు, కామాటీల జీవితాల్లో వెలుగు కన్పించడం లేదు. ఒకటి కాదు రెండు కాదు దశాబ్దాలుగా పని చేస్తూ.. నేడో.. రేపో తమను గుర్తించకపోతారా..? అనే ఆశతో కడుపు నింపని జీతాలతో దయనీయ స్థితిలో ఇటు పని భారాన్ని.. అటు కుటుంబ భారాన్ని మోస్తున్నారు. పంచాయతీల్లో పని చేసే కారోబారీలు, పంచాయతీల్లో వివిధ పనుల కోసం నియమించిన కామాటీల పరిస్థితి దారుణంగా మారింది. వీరు గ్రామాల్లో కాలువల నిర్వహణ, చెత్త సేకరించి తరలించడం, సమయానికి తాగునీరు అందేలా చూడడంతో పాటు, పన్నులు వసూలు చేయడం వివిధ ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేయడం దండోరా ఇచ్చి ప్రజలను పోగు చేయడం నుంచి పశు కళేబరాలను తరలించడంతో పాటు గ్రామాల్లో చేప ట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తూ ఎంతో ఓపిగ్గా విధులు నిర్వహిస్తున్నారు. అయినా ప్రభుత్వం నుంచి వీరికి ఎలాంటి గుర్తింపు లేదు. కారోబార్లు 35ఏళ్ల నుంచి వెట్టిచాకిరి చేస్తున్నా మొన్నటి వరకు నెలకు కేవలం రూ.3వేల నుంచి రూ.8వేలలోపు జీతం చెల్లించారు. ప్రస్తుతం రూ.9500 చెల్లిస్తున్నారు. ఇకనైనా తమకు న్యాయం చేయాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కారోబార్లు డిమాండ్ చేస్తున్నారు. గతంలో తమ సమస్యల పరిష్కారానికై ఉమ్మడి జిల్లాలోని పంచాయతీ కార్మికులు నిరవధిక సమ్మె చేశారు. వీరిలో కారోబారీ, కామాటీ, పంప్ ఆపరేటర్లు, పారిశుధ్య కార్మికులు, ఎలక్ట్రీషన్, వాచ్‌మెన్, బిల్ కలెక్టర్లు ఉన్నారు.

కొత్త పంచాయతీ చట్టం అమలుతో..

రాష్ట్రంలో కొత్త పంచాయతీ చట్టం అమలు కావడంతో జనాభా ప్రతిపాదికన కొత్తగా పంచాయతీలు ఏర్పడడంతో కారోబారీలు శకం ముగిసింది. ఉమ్మడి జిల్లా ఉన్నప్పుడు 864 పంచాయతీల్లో ఈ కారోబారీ, కామాటి వ్యవస్థ ఉంది. ఆ తర్వాత కేవలం ఆదిలాబాద్‌లో జిల్లాలోనే ఏర్పడిన నూతన పంచాయతీలతో కలిపి ప్రస్తుతం 434 పంచాయతీలు ఏర్పడ్డాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో 573, ఆదిలాబాద్ జిల్లాలో 250 కారోబార్లు సేవలందిస్తున్నారు.

40ఏళ్లుగా పని చేస్తున్నా.. రూ.9500 దాటని జీతం

నేడు సగటు మనిషి జీవన వ్యయం రోజు రోజుకూ పెరుగుతూ పోతోంది. సాధారణ ఉపాధి కూలీ సైతం ఒక పూట పని చేసి రోజుకు రూ.300పైనే సంపాదిస్తున్నాడు. కానీ పంచాయతీ కారోబారీలు కనీస వేతనం పొందడం లేదు. పంచాయతీకి పట్టుకొమ్మల్లా ఉంటూ నిరంతర సేవలందిస్తున్న వీరి కుటుంబాలు ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాయి. వీరికి కనీస వేతనాలు ఇవ్వక పోవడంతో వచ్చే నెల జీతం భోజన సరుకులు, కనీస సౌకర్యాల నిర్వహణకు సరిపోకపోవడం దురదృష్టకరం.

40 ఏళ్ల సర్వీసు..జీతం రూ.9500



గత 40 ఏళ్లుగా మేజర్ పంచాయతీ కారోబారిగా పని చేస్తున్న. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ నుంచి పంచాయతీ రికార్డులు, పన్నుల వసూలు, ఆదాయ వ్యయాల నిర్వహణతో పాటు రోజు కార్యాలయంలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నం.

– అమీన్ అలీ, కారోబారి, గుడిహత్నూర్

రిటైర్‌మెంట్‌కు దగ్గర ఉన్నా..



1978 మార్చి 1 నుంచి పంచాయతీ కారోబారీగా బాధ్యతలు నిర్వహిస్తున్నా. ప్రస్తుతం మల్టీపర్పస్ వర్కర్‌గా సేవలందిస్తున్నా. 45ఏళ్ల పాటు సేవలందిస్తే ఆఖరుకు రూ.9వేల జీతం ఇస్తున్నారు. పంచాయతీ సేవలో నా జీవితం ముగిసింది. ప్రస్తుతం మల్టీపర్పస్ వర్కర్‌గా సేవలందిస్తున్న. కారోబారీలను నేటికీ ప్రభుత్వం గుర్తించకపోవడం సరికాదు.

– ధనూరే మారుతిరావ్, కారోబారి, కొల్హారీ

న్యాయం చేయాలి



45ఏళ్లుగా పంచాయతీల్లో కారోబారీలుగా సేవలందిస్తున్నాం. నేటికీ మా జీతాలు రూ.9500 దాటలేదు. రిటైర్మెంట్ తీసుకుంటే పెన్షన్ లేదు. పీఎఫ్ రాదు. ఆర్థిక ఇబ్బందుల్లో జీవితాన్ని భారంగా మోస్తున్నాం. ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీ నెరవేర్చి ఇప్పుడైనా మాకు న్యాయం చేయాలి.

– కానిందే గంగాధర్, కారోబారి సంఘం జిల్లా అధ్యక్షుడు ఆదిలాబాద్

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

భైంసాటౌన్: గణేశుడి నిమజ్జనం నేపథ్యంలో పట్టణంలో శోభాయాత్ర నిర్వహించే పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు ఆ శాఖ ఏడీఈ ఆదిత్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నిమజ్జన శోభాయాత్ర ప్రారంభం మొదలు ముగిసే వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహిళలకు అండగా ప్రభుత్వం

భైంసారూరల్: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అండగా నిలుస్తుందని ఎంపీపీ కల్పన అన్నారు. సోమవారం భైంసా మండల పరిషత్ కార్యాలయంలో 73మందికి కల్యాణలక్ష్మి, 138 మందికి షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు గజానంద్, ఇలేగాం సర్పంచ్ ముత్యం, డిప్యూటీ తహసీల్దార్ అశోక్, ఆర్ఐలు కృష్ణాగౌడ్, జయరాజ్, నాయకులు గణేశ్‌పటేల్ ఉన్నారు.

స్తంభాలు ఏర్పాటు

కుంటాల: పల్లె ప్రగతిలో భాగంగా మండలంలోని అందాకూర్‌లో సోమవారం కొత్త స్తంభాలను ఏర్పాటు చేయించారు. ఈ మేరకు కొనసాగుతున్న పనులను విద్యుత్ ఏఈ శివప్రసాద్ పర్యవేక్షించారు. సర్పంచ్ దాసరి కిషన్, లైన్ ఇన్‌స్పెక్టర్ శివన్న, జూనియర్ లైన్‌మెన్ అవదూత్ తదితరులు ఉన్నారు.

అపరిచితులకు వివరాలు చెప్పొద్దు

భైంసా: అపరిచితుల ఫోన్లకు స్పందించొద్దని.. వారికి ఎట్టి పరిస్థితుల్లో బ్యాంకు, ఫోన్లకు వచ్చే ఓటీపీ వివరాలు చెప్పొద్దని ఏఎస్సై ఉజ్వల అన్నారు. సోమవారం బాసరలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు రుణాలు, లక్కీ స్కీంల పేర్లు చెప్పి బ్యాంకు ఖాతాలోంచి డబ్బులు మాయ చేస్తున్నారని వారు పేర్కొన్నారు. వారి వెంట పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య స్నేహితుడికి చేయూత

మామడ: మండలంలోని పోతారం గ్రామానికి చెందిన భీమేశ్ ఇటీవల అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమయ్యాడు. భీమేశ్‌తో కలిసి పొన్కల్ ఉన్నత పాఠశాలలో 2006–07లో పదో తరగతి చదివిన మిత్రులు సోమవారం అతడిని పరామర్శించారు. ఈ సందర్భంగా నిత్యావసర సరుకులను అందించారు. కార్యక్రమంలో రాము, రాజు, కార్తీక్, లక్ష్మినర్సయ్య తదితరులు ఉన్నారు.

బీఎల్‌వోల వినతి

ఖానాపూర్: తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని బీఎల్‌వోలు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వరలక్ష్మి, లీలారాణి, చందురాణి, తదితరులున్నారు.

క్విజ్ పోటీలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దేవరకోట దేవస్థానంలో నిర్మల్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సోమవారం పాఠశాలల విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, క్విజ్, హనుమాన్ చాలీసా పారాయణంపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి మురళి, జనార్దన్, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్లు పంపిణీ

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కె), లక్ష్మణచాంద, వడ్యాల్‌తండా, బాబాపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చైల్డ్‌లైన్ సిబ్బంది, వీవోఏల ద్వారా లబ్ధిదారులకు కోడిగుడ్లు, బియ్యం, నూనె వస్తువులను గర్భిణులు, బాలింతలకు అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, సిబ్బంది పద్మావతి, సఖీ కేంద్రం సభ్యురాలు లలిత, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

అందని వైద్యసేవలు

కుంటాల: వైద్యురాలి నిర్లక్ష్యంతో రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదని.. వెంటనే ఉన్నతాధికారులు సమస్య పరిష్కరించాలని సర్పంచ్ దొనికెన సమతా ఆరోపించారు. సోమవారం కుంటాల పీహెచ్‌సీని ఆయన సందర్శించి మాట్లాడారు. ఉదయం 10గంటలు దాటినా వైద్యురాలితో పాటు సిబ్బంది రావడం లేదని వాపోయారు. వైద్యురాలిని బదిలీ చేసి మరొకరిని నియమించాలని కోరారు. దొనికెన వెంకటేశ్, బోగ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

'అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమించాలి'

నిర్మల్‌చైన్‌గేట్: కులపీడన అణచివేతకు వ్యతిరేకంగా సాంఘిక ఉద్యమాలు నిర్మించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కె.రాజన్న అన్నారు. నిర్మల్‌లోని భగత్‌సింగ్ భవన్‌లో సోమవారం సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా ఆధ్వర్యంలో కుల నిర్మూలన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా 150 ఏళ్ల కిందట జ్యోతిబాఫూలే సత్యశోధక్ సమాజ్ ఏర్పాటు చేశారన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కట్ల లక్ష్మి, గంగామణి, లక్ష్మి, ధర్మరాజు, రాజన్న, గంగాధర్ పాల్గొన్నారు.

దేశీదారుకు అడ్డుకట్టపడేనా?

- సరిహద్దులో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసిన ఎక్సైజ్‌శాఖ
- రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చర్యలు
- విక్రయిస్తే చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరిక


బెల్‌తరోడా చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు


బెల్‌తరోడా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్

తానూరు: తెలంగాణలో మద్యం ధరలు అధికంగా ఉండటంతో సరిహద్దున ఉన్న మహారాష్ట్ర నుంచి దేశీదారు విచ్చలవిడిగా నిర్మల్ జిల్లాకు అక్రమంగా రవాణా అవుతోంది. సరిహద్దు ప్రాంతంలో నిఘా లోపించడంతో మహారాష్ట్రలోని వైన్స్‌ల్లో తక్కువ ధరకు లభించే మద్యాన్ని వ్యాపారులు ఇక్కడి పల్లెలకు తీసుకొచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వంతోపాటు తెలంగాణలో వైన్సుల ఆదాయానికి సైతం గండిపడుతోంది. ఇటీవల జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ పోలీసులు దేశీ దారును పట్టుకుని కేసులు నమోదు చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

కమిషనర్ ఆదేశాలతో చెక్‌పోస్టు ఏర్పాటు..

గతంలో నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా పని చేసిన ముషరఫ్ అలీ ఫారూఖి ప్రస్తుతం ఎక్సైజ్‌శాఖ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లాపై వారికి పట్టు ఉండడంతో మహారాష్ట్ర మద్యం(దేశీదారు) తెలంగాణలోకి రానివ్వకుండా సరిహద్దు ప్రాంతంలో ఎక్సైజ్ శాఖ అధికారుల చేత నిఘా ఏర్పాటు చేయించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా తానూరు మండలంలోని బెల్‌తరోడా వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. అక్కడ సీఐతోపాటు నలుగురు పోలీసులు విధులు నిర్వర్తిస్తూ వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని సరిహద్దు మండలాలకు ప్రత్యేకంగా ఎస్సైని నియమించి ముమ్మర తనిఖీలను నిర్వహిస్తున్నారు.

డివిజన్‌లో జోరుగా విక్రయాలు..

భైంసా డివిజన్ పరిధిలోని సరిహద్దు మండలాలైన తానూరు, కుభీర్, ముధోల్, బాసర, కుంటాల, లోకేశ్వరం, భైంసా మండలాల్లో ఈ దందా జోరుగా సాగుతోంది. తానూరు మండలంలోని బామ్ని, మొగ్లి, మహాలింగి మసల్గా, కల్యాణి, జౌలా(బి), తొండాల, ఖర్బాలా, ఎల్వత్, దాగాం, దౌలతాబాద్, బోల్సా, కోలూరుతోపాటు బాసర మండలంలోని బిద్రేల్లి, ఒని, కౌటా, సాలాపూర్, టాక్లి, కుభీర్ మండలంలోని నిగ్వా, పార్డీ(బి), హల్దా, పల్సి గ్రామాల్లో దేశీదారు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

తక్కువకు వస్తుందనే..

తెలంగాణలో లభించే మద్యం కంటే తక్కువ ధరకు దేశీదారు వస్తుండటంతో దీని వినియోగానికే మద్యం ప్రియుల మొగ్గు చూపుతున్నారు. రోడ్డు మార్గంలో వీలుకాకుంటే గుట్టల గుండా అక్రమార్కులు దేశీదారును గ్రామాలకు సరఫరా చేస్తున్నారు

> **తనిఖీలు నిర్వహిస్తున్నాం**
> మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో రాత్రి, పగలు ప్రత్యేక బృందాలతో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. బెల్‌తరోడా వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి అక్రమంగా మహా మద్యం రాకుండా చర్యలు చేపడుతున్నాం. దేశీదారు అమ్మినట్లు తెలితే వారికి రూ.2 లక్షల జరిమానాతోపాటు ఆరునెలల జైలుశిక్ష ఉంటుందని హెచ్చరిస్తున్నాం. రెండు నెలలుగా కేసులు తగ్గుతున్నాయి.
> – నజీర్ హుస్సేన్, ఎక్సైజ్ సీఐ, భైంసా

306 మంది బైండోవర్..

డివిజన్ వ్యాప్తంగా దేశీదారుతో పట్టుబడిన వారితోపాటు గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించే వారిని బైండోవర్ చేస్తున్నారు. ఏడాదిలో డివిజన్ వ్యాప్తంగా 306 మందిని బైండోవర్ చేసినట్లు అధికారులు తెలిపారు. గుడుంబా అమ్మినట్లు గుర్తిస్తే రూ.రెండు లక్షల జరిమానాతోపాటు ఆరునెలల జైలుశిక్ష ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

తానూరు: అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని ముధోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా 19 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. తానూరు, ఝరి(బి)తండా, బామ్నితండా గ్రామాలకు 10 మంది చొప్పున లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం కస్తూరిబాలో రూ.27 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. తహసీల్దార్ లింగమూర్తి, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోతారెడ్డి, సర్పంచ్ విఠల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

ప్రొసీడింగ్ అందజేత

ముధోల్: కుభీర్ మండలం పార్డి(కే)లో రాజరాజేశ్వర ఆలయ సమీపంలో నిర్మించే కల్యాణ మండపానికి రూ.30లక్షలు మంజూరు చేశారు. సోమవారం ముధోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రొసీడింగ్ కాపీని ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్‌కు అందజేశారు. మాజీ జెడ్పీటీసీ శంకర్, సాయన్న, నర్సారెడ్డి తదితరులున్నారు.

గణపయ్యకు ప్రత్యేక పూజలు


మండపం వద్ద పూజలు చేస్తున్న శ్రీహరి రావు


కడెం: పెద్దూర్‌తండాలో మహిళల పూజలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలో వినాయకుడిని సోమవారం డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు దర్శించుకున్నారు. జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, సాగర్‌రెడ్డి, చిన్ను, అరవింద్, గణేశ్, రవికుమార్, రమణ తదితరులున్నారు.

కడెం: మండలంలోని పెద్దూర్‌తండా, మొర్రిగూడెం ,కొండుకూర్ గ్రామాల్లో కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు పాల్గొని పూజలు చేశారు.

ఖానాపూర్: పట్టణంలోని జేకేనగర్, శాంతినగర్‌లోని సేవాదల్ మండపం వద్ద అన్నదానం నిర్వహించారు. గోసంపల్లెలో శాంతియూత్ మండపంలో భక్తులు 108 రకాల నైవేద్యాలను సమర్పించారు.


ఖానాపూర్: గోసంపల్లెలో భక్తుల పూజలు

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె


ముధోల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

నర్సాపూర్(జి): ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేస్తున్న నిరవధిక సమ్మె 15వరోజుకు చేరింది. సోమవారం వీరి సమ్మెకు కాంగ్రెస్ నాయకులు, సారంగపూర్ జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. విద్యాసాగర్‌రెడ్డి, దశరథ్, రాజేశ్వర్, నారాయణరెడ్డి, రమణ, అబ్బు తదితరులు పాల్గొన్నారు.

ఒంటికాలిపై అంగన్‌వాడీల నిరసన

ముధోల్: మండల కేంద్రంలో సోమవారం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఒంటికాలిపై నిల్చొని వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేష్మ, మండల అధ్యక్షురాలు వనిత, శ్రీదేవి, రేఖ, శోభ, తదితరులు ఉన్నారు.

నిరవధిక సమ్మెలోకి ఆశవర్కర్లు

భైంసాటౌన్: ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు అందించి.. ఉద్యోగ భద్రత కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భైంసాలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద ఆశవర్కర్లు నిర్వహించిన సమ్మెకు మద్దతు తెలిపారు. ఆశావర్కర్స్ యూనియన్ భైంసా అధ్యక్షులు విజయ, ఉజ్వల, మౌనిక, చంద్రకళ, అశ్విని, పార్టీ డివిజన్ కన్వీనర్ గైని మురళీమోహన్, తదితరులు పాల్గొన్నారు.

దస్తురాబాద్: ఆశవర్కర్లు ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమ్మెకు దిగారు. అనసూర్య, సుజాత, గోదావరి, లక్ష్మి, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: తమ సమస్యలు పరిష్కరించాలని ఆశవర్కర్లు పోలీస్‌స్టేషన్‌లో, తహసీల్దార్ కార్యాలయంలో వేర్వేరుగా వినతిపత్రం అందించారు. ఇంద్రమాల, మమత, రజిత, వినోద, త్రివేణి, దేవకి, విజయ పాల్గొన్నారు.

సారంగపూర్: మండలంలోని ఆశవర్కర్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. లక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.


భైంసాలో సమ్మెకు మద్దతు తెలుపుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నూతన్‌కుమార్

ముధోల్/లోకేశ్వరం: తమ సమస్యల పరిష్కారానికి ఆశవర్కర్లు సమ్మె బాట పట్టారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేపట్టారు. లోకేశ్వరంలో ఆశవర్కర్ల సంఘం మండలాధ్యక్షురాలు ఆనంద మాట్లాడారు. గోదావరి, కల్యాణి, స్వప్న, సాయన్న, అనురాధ, సవిత, శారద, సబిత, గంగామణి తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: సమస్యలు పరిష్కరించాలని మండలంలోని ఆశవర్కర్లు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్షలు చేపట్టారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గంగామణి, రజిత, మమత, వినోద, త్రివేణి తదితరులు ఉన్నారు.


కుంటాలలో నినాదాలు చేస్తున్న ఆశవర్కర్లు


ఖానాపూర్‌లో..

నిర్మల్‌ను ముంచిన ఘనత మంత్రిదే

- ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
- వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ప్రచారం

లక్ష్మణచాంద: తొమ్మిదేళ్ల కాలంలో నిమ్మరాజులు కట్టించిన గొలుసుకట్టు చెరువులను మాయం చేసి..నిర్మల్‌ను నిండా నీళ్లతో ముంచిన ఘనత మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికే దక్కుతుందని బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మునిపెల్లి, మల్లాపూర్, మాచాపూర్, పార్‌పెల్లి, పార్‌పెల్లితండా గ్రామాల్లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి తన కుటుంబసభ్యులు, అనుచరుల ఆస్తులు పెంచుకున్నారు తప్ప.. నిర్మల్ అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. మంత్రి సొంతూరు ఎల్లపల్లిలో ప్రారంభించిన డబుల్ బెడ్ రూం ఇళ్లలో కనీస సౌకర్యాల్లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో నిర్మల్ గడ్డపై కాషాయజెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మండల అధ్యక్షులు గోవర్దన్, సర్పంచ్‌లు పద్మ, రవి, నాయకులు వెంకట్‌రెడ్డి, భూపాల్ రెడ్డి, రాజేందర్, ముత్యం రెడ్డి, హరీశ్‌రెడ్డి, గంగన్న, భూపతిరెడ్డి, నారాయణ్, అర్జున్ శంకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


మాచాపూర్‌లో మాట్లాడుతున్న మహేశ్వర్ రెడ్డి

ఆశవర్కర్లు, అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు..

బీజేపీ అధికారంలోకి రాగానే అంగన్‌వాడీల సిబ్బంది, ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని మహేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీ, ఆశవర్కర్ల సమ్మె శిబిరం వద్దకు వెళ్లి మద్దతు తెలిపారు. సరికెల గంగన్న తదితరులు ఉన్నారు.

బీజేపీలో పలువురు చేరిక

లక్ష్మణచాంద మండలంలోని మునిపెల్లికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ నూతికాడి చిన్న రాజారెడ్డి, నాయకులు రంజిత్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, షేర్ రాజారెడ్డి, లింగారెడ్డిపాటు బీఆర్‌ఎస్ వార్డు సభ్యులు సునీత, పలువురు బీజేపీలో చేరారు. వీరికి మహేశ్వర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అభివృద్ధి పనులపై సమావేశం

పెంబి: మండలంలోని అంకెన, కర్ణంలోద్ది, రాయదారి, పోచంపల్లి, కోరకంటి గ్రామాల్లో సోమవారం పలు శాఖల అధికారులు సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులపై చర్చించారు. నీతి ఆయోగ్ చింతన్ శివిర్ యాస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రాంకు పెంబి మండలం ఎంపికైనట్లు కలెక్టర్ వరుణ్‌రెడ్డి తెలిపాడని పలువురు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో రత్నాకర్ రావు, ఏవో రవి, ఏఈవో రాజ్‌కుమార్, ఏపీఎం గంగారెడ్డి, ఏపీవో రాజశేఖర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

కడెం: జిల్లా కేంద్రంలోని తన నివాసంలో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావును సోమవారం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శంకర్ మర్యాద పూర్వకంగా కలిశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని డీసీసీ అధ్యక్షుడు సూచించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సారంగపూర్ జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్షద్, సలీం తదితరులు ఉన్నారు.

పొదుపు అలవర్చుకోవాలి

కుంటాల: ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంత పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని కల్లూర్ టీజీబీ మేనేజర్ శాంతి అన్నారు. సోమవారం మండలంలోని అందాకూర్ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. బ్యాంకు అందించే బీమా, రుణాలను వివరించారు. సర్పంచ్ దాసరి కిషన్, ఫీల్డ్ ఆఫీసర్ పృథ్వీ పాల్గొన్నారు.

ప్రశాంతంగా నిమజ్జనోత్సవం

ముధోల్: మండల కేంద్రంతోపాటు చించాల గ్రామంలో ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు గణేశుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు. మండల కేంద్రంలో క్రేన్ల సాయంతో నిమజ్జనం తంతు పూర్తి చేశారు. సీఐ వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో 200 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

తానూరు: మండలంలోని, హిప్నెల్లి, ఉమ్రి(కే) గ్రామాల్లో సోమవారం గణేశుడి నిమజ్జనం నిర్వహించారు. గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు పూజలు చేసి శోభాయాత్ర ప్రారంభించారు.


ఏర్పాట్లు పరిశీలన..


కుభీర్: నిమజ్జనానికి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్న ఎస్సై ఎండీ.షరీఫ్ అన్నారు.సోమవారం అధికారులు, గ్రామపెద్దలు దార్‌కుభీర్, దొడర్నా చెరువులతోపాటు కుభీర్ చెక్‌డ్యాంను పరిశీలించారు. చిన్న విగ్రహాలను చెక్‌డ్యాంలో.. పెద్ద ప్రతిమలను గడ్డెన్న వాగులో నిమజ్జనం చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఎస్సై ఎండీ.షరీఫ్, సర్పంచ్ భర్త విజయ్, ఉత్సవ కమిటీ అధ్యక్షులు వివేక్, ఆర్ఐ విజయ్, ఆలయ కమిటీ అధ్యక్షులు నార పరశురాం తదితరులు ఉన్నారు.



కుభీర్ చెక్‌డ్యాం వద్ద అధికారులు, గ్రామస్తులు

అగ్నిపథ్‌కు ఎంపిక

కుంటాల: మండలంలోని సూర్యాపూర్‌కు చెందిన సిందే శివాజీ పటేల్, అందాకూర్‌కు చెందిన సాయికిరణ్, రాయపాడ్ తండాకు చెందిన జాదవ్ సురేశ్ అగ్నిపథ్‌కు ఎంపికయ్యారు. అగ్నివీర్‌లుగా ఎంపికైన యువకులను పలువురు గ్రామస్తులు అభినందించారు. ఏప్రిల్‌లో ప్రవేశ పరీక్ష.. రెండు నెలల కిందట ఖమ్మంలో దేహదారుడ్య పరీక్షలు నిర్వహించగా సోమవారం ఫలితాలు వెలుపడ్డాయి.


సిందే శివాజీ


సాయికిరణ్


జాదవ్ సురేశ్

మంత్రి పరామర్శ

దిలావర్‌పూర్: మండలంలోని మాడేగాం గ్రామానికి చెందిన ముచ్చిండ్ల చందర్ అనే విశ్రాంత ఉపాధ్యాయుడు ఇటీవల డెంగీతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని సోమవారం సాయంత్రం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. ఇందులో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ దేవేందర్ రెడ్డి, కదిలి పాపహరేశ్వరాలయ చైర్మన్ వెంకట్రావు, రైతుబంధు మండలాధ్యక్షుడు రాజేశ్వర్, అనిల్, గుణవంత్‌రావు, రవి, భుజంగ్‌రావు, దత్తుపాటిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ప్లాస్టిక్‌ను బహిష్కరించాలి

నిర్మల్‌టౌన్: పర్యావరణ హితం కోసం ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని బహిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), పురపాలక సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని మదిన కాలనీలో నిర్మల్ స్టీల్‌బ్యాంక్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఇంట్లో జరిగే వేడుకలకు స్టీల్ పాత్రలు వాడేవారని.. ఇప్పుడు కూడా ఆరోగ్యం కోసం మళ్లీ పాత పద్ధతులు అలవాటు చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ రాజు, కౌన్సిలర్లు మహమ్మద్ రఫీ, సలీం , మెప్మా పీడీ సుభాష్ తదితరులు ఉన్నారు.


స్టీల్ బ్యాంకును ప్రారంభించిన చైర్మన్, కమిషనర్

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

కుంటాల: పరిసరాల పరిశుభ్రత పాటించి రోగాల బారిన పడకుండా ఉండాలని డీఎల్పీవో శివకృష్ణ పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం కుంటాలలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విజయసాయి పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్లకు బదులు జ్యూట్ బాగులను వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో రహీం, కార్యదర్శి రాజబాపు, ప్రిన్సిపాల్ స్వప్న, గ్రామపెద్దలు వెంకటేశ్, లక్ష్మణ్, సంతోష్, శివప్రసాద్ పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు తొలగింపు..

లక్ష్మణచాంద: స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సిబ్బంది పిచ్చి మొక్కలను తొలగించారు. పొట్టపెల్లి (కే), పీచరలో రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలతోపాటు చెత్తాచెదారం, ప్లాస్టిక్ వస్తువులను తొలగించారు. ఎంపీడీవో శేఖర్, ఎంపీవో నసీరుద్దీన్, పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని బామిని(బి) గ్రామస్తులకు ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శి గంగాజల అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌కు బదులు స్టీల్, జ్యూట్ బ్యాగులను వినియోగించాలని ప్రతిజ్ఞ చేయించారు.

బాధ్యతలు స్వీకరించిన హెచ్‌ఎంలు

లోకేశ్వరం: మండలంలో ఉన్నత పాఠశాలల్లో సోమవారం పీజీ హెచ్‌ఎంలు బాధ్యతలు స్వీకరించారు. లోకేశ్వరం పాఠశాల హెచ్‌ఎంగా ప్రవీణ్‌కుమార్, పంచగుడి–ధర్మోర ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా సుభాష్, పుస్పూర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా చంద్రప్రకాశ్, గడ్‌చాంద ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా రవీందర్, కన్కపూర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ప్రభాకర్, రాజూర ఉన్నత పాఠశాలకు రాజేశ్వర్, పిప్రి పాఠశాలకు హెచ్‌ఎంగా అశోక్ బాధ్యతలు స్వీకరించారు.

దస్తురాబాద్: మున్యాల జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా వామన్‌రావ్, దస్తురాబాద్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా గంగాధర్ బాధ్యతలు స్వీకరించారు.

తానూరు: మండలంలోని ఎల్వి జెడ్పీ పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన నరేందర్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు.

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్ జెడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయురాలుగా ఆసూరి రమాదేవి బాధ్యతలు చేపట్టారు.